

నేటి నుంచి అనంత పద్మనాభుని కల్యాణోత్సవాలు

- పుట్ట బంగారంతో ఉత్సవాలకు శ్రీకారం
- 24న రథోత్సవం... 25న డోలోత్సవం

... వివరాలు 1లో



ఉక్కుకు విద్యుత్ కష్టాలు



పరిశ్రమ అవసరాల కోసం గతంలో సొంతంగా థర్మల్ పవర్ ప్లాంటు ఏర్పాటు

- ప్రైవేటీకరణ ప్రతిపాదన తెరపైకి రావడంతో తగ్గిన బొగ్గు సరఫరా
- ప్లాంటులో తగ్గిన విద్యుదుత్పత్తి...
- గత్యంతరం లేక ఈపీడీసీఎల్‌పై ఆధారం
- నెలకు రూ.80 కోట్ల మేర బిల్లు
- ఆర్థిక సమస్యల కారణంగా ప్రస్తుతం వెంటనే చెల్లించలేని పరిస్థితి
- నోటీసులపై నోటీసులు ఇస్తున్న తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ
- రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకువెళ్లిన కార్మికులు
- స్పందన శూన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు కర్మాగారం పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. జీతాలు ఇవ్వడమే కష్టంగా మారింది. ఈ నెల ఇప్పటివరకూ పెన్షన్లు కూడా ఇవ్వలేదు. ఇంత దారుణ పరిస్థితి ఉంటే తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) అధికారులు... బిల్లు చెల్లించకపోతే సరఫరా ఆపేస్తామంటూ నోటీసులపై నోటీసులు ఇస్తున్నారు. ఇదేమన్నా వందల కోట్ల బకాయా?, అంటే కానే కాదు. కేవలం రూ.80 కోట్లు. దానికే ఫ్యూజులు పీకేస్తామని భయపెడుతున్నారు.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో 315 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ ప్లాంటు ఉంది. ఇదికాకుండా వృథా వాయువుల నుంచి మరో 150 మెగావాట్లు ఉత్పత్తి చేస్తారు. ఈ రెండూ పూర్తిస్థాయిలో పనిచేస్తే తమ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసేవారు. అయితే ప్రైవేటీకరణ ప్రక్రియ వేగవంతం కాగానే అన్ని వైపుల నుంచి సహాయ నిరాకరణ మొదలైంది. థర్మల్ విద్యుత్ ప్లాంటుకు అవసరమైన బాయిలర్ బొగ్గు ఒడిశాలోని మహానది కోల్ ఫీల్డ్స్ నుంచి వస్తుండేది. టన్ను రూ.3,200కే లభించేది. అదే బయట కొనాలంటే రూ.6 వేలుపైనే. ఏడాదికి 17 లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు ఆ సంస్థతో ఒప్పందం ఉంది. 2021 వరకు సరఫరా బాగానే జరిగింది. అక్కడి నుంచి స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేగవంతం కావడంతో బొగ్గు సరఫరా తగ్గిపోయింది. రైల్వే ర్యాకులు అందుబాటులో లేవని 50 శాతం కూడా బొగ్గు ఇవ్వడం లేదు. దాంతో సొంత ఉత్పత్తి పడిపోయింది. గత్యంతరం లేక ఈపీడీసీఎల్ నుంచి అవసరమైన విద్యుత్ తీసుకుంటున్నారు. మొదట్లో ఈ బిల్లు నెలకు రూ.20 కోట్లు మాత్రమే ఉండేది. అటు నుంచి బొగ్గు సరఫరా తగ్గిపోతుంటే..ఇటు విద్యుత్ దిగుమతి పెరిగిపోయి బిల్లులు ఎక్కువ వస్తున్నాయి. ఇప్పుడు నెలకు రూ.80 కోట్లు దాటి బిల్లు వస్తోంది. ప్లాంటు నిధుల లేమి వల్ల సకాలంలో వాటిని చెల్లించలేకపోతోంది. బకాయి రూ.50 కోట్లకు మించి ఉండడం లేదు. అయినా సరే ఒకటో తేదీ కల్లా బిల్లు చెల్లించాలంటూ ఈపీడీసీఎల్ నోటీసులు పంపుతోంది. ఇటీవల సరఫరా నిలిపివేస్తామని బెదిరించింది. దాంతో ఉద్యోగుల జీతాలు ఆపేసి ముందు విద్యుత్ బిల్లు కట్టాల్సి వస్తోంది. ఈ సమస్యను రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వివరించి, ఈపీడీసీఎల్ అధికారుల నుంచి ఒత్తిడి లేకుండా చూడాలని, ఒకటి, రెండు నెలల గడువు ఇప్పించాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు కోరాయి. కానీ ఆయన ఆ చిన్న సాయం కూడా చేయలేకపోయారు. యథాప్రకారం ఈపీడీసీఎల్ నోటీసులు పంపుతూనే ఉంది. ఒక్క నెల కూడా బకాయి లేకుండా ముక్కు పిండి వసూలు చేస్తోంది. ఇప్పుడు మళ్లీ అదే తరహాలో నోటీసులు ఇచ్చింది. ఈ నెల ఇంకా పెన్షన్లే ఇవ్వలేదని, బిల్లు ఎక్కడ కట్టగలమని ఉక్కు యాజమాన్యం వాపోతోంది. మంత్రి అమర్‌నాథ్ ఈసారి స్టీల్‌ప్లాంటు ఉన్న గాజువాక నియోజకవర్గం నుంచే పోటీకి దిగుతున్నారు. ఉద్యోగులు, కార్మికులు కలిసి పది వేల మంది ఓటర్లు ఉన్నారు. అతి పెద్ద కర్మాగారం ఇదే. ఇప్పుడైనా స్టీల్‌ప్లాంటు సమస్యపై గళం విప్పి, కష్టాల నుంచి గట్టెక్కించడానికి మంత్రి అమర్ చొరవ చూపాలని, ముఖ్యమంత్రి జగన్‌తో స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ప్రకటన చేయించాలని ఇక్కడివారు డిమాండ్ చేస్తున్నారు.

మాట ఇచ్చి, మడమ తిప్పి..

ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు జగన్ ధోకా

- కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రతకు నాడు ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో హామీ
- ఐదేళ్లు పూర్తయినా నెరవేర్చని వైనం
- అధికారంలోకి వచ్చిన తరువాత రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు
- ఇప్పటికీ వెలుగుచూడని నివేదిక
- ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వేల మంది ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు
- వైసీపీ సర్కారుకు గుణపాఠం చెబుతామంటున్న ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు



విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

"ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు కనీస వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు టీచర్ల స్థితిగతులు మెరుగుపర్చేందుకు ఒక రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుచేస్తాం. ఆ కమిషన్ ఇచ్చే నివేదిక మేరకు మెరుగైన పరిస్థితులు తీసుకువస్తాం"

- పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ.



పాదయాత్ర సమయంలో ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ డిమాండ్ల ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న జగన్మోహన్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

..అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ డిమాండ్లతో కూడిన బ్యానర్‌ను కూడా పట్టుకుని మరీ పాదయాత్ర చేసిన జగన్మోహన్‌రెడ్డి..ఏరు దాటిన తరువాత తెప్పను తగలేసినట్టు అధికారంలోకి వచ్చిన తరువాత తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది వరకూ ఉండగా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 300కుపైగా కాలేజీలు, స్కూల్స్‌లో 35 వేల మంది వరకూ పనిచేస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరికి కనీస వేతనాలు అందడం లేదు. ఇప్పటికీ దాదాపు 70 శాతం మందికి రూ.5 వేలు నుంచి రూ.15 వేల మధ్య వేతనంగా లభిస్తోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటివి అమలు చేయడం లేదు. అదేవిధంగా ఏడాదిలో పది నెలలకు మాత్రమే వేతనాలను పొందు తున్నారు. వేసవి సెలవుల్లో చాలా స్కూల్స్ యాజమాన్యాలు జీతాలు ఇవ్వడం లేదు. ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో పనిచేసే టీచర్లు/లెక్చరర్లతోపాటు ఆయాలు, బస్ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాన్ని కల్పించాలని, వేసవి సెలవుల్లో కూడా జీతాలు చెల్లించేలా, ప్రభుత్వ సెలవులు వర్తించేలా చూడాలని, జీవో నంబర్ ఎంఎస్-1ను విధిగా అమలు చేయాలని, ప్రధానంగా ఉద్యోగ భద్రతను కల్పించాలని చాలాకాలంగా కోరుతున్నారు. ఆ హామీలను నెరవేరుస్తానని నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా పలుమార్లు మాట ఇచ్చారు. ఇందుకోసం రెగ్యులరేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు.

నివేదిక ఏమైనట్టు..?

జగన్మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. ఆలూరి సాంబశివా రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిషన్ అనేక అంశాలను కూలంకుషంగా పరిశీలించి నివేదికను సమర్పించింది. అయితే, ఐదేళ్లు కావస్తున్నా ఆ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కమిషన్ ఏం నివేదిక ఇచ్చిందో ఇప్పటివరకూ చెప్పలేదని, ప్రభుత్వం ఏర్పాటై ఐదేళ్లు పూర్తయినా ఇప్పటికీ తమకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని టీచర్లు, లెక్చరర్లు వాపోతున్నారు. ప్రైవేటు కాలేజీలు, స్కూల్స్‌లో పనిచేసే సిబ్బందిని జగన్మోహన్‌రెడ్డి నమ్మించి మోసం చేశారని ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ... మిగతా 6వ పేజీలో

జగన్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం

- సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు
- పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారంటూ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు. చిత్రంలో సంఘానికి చెందిన ఇతర ప్రతినిధులు ఉన్నారు

డాబాగార్డెన్స్, మార్చి 20: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఓటమే ధ్యేయంగా పనిచేస్తామని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు ప్రకటించారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ఆరోపించారు. పంచాయతీల్లో సమస్యలపై తమ సంఘం గత మూడున్నరేళ్లుగా ఆందోళనలు చేస్తున్నదన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పంచాయతీలకు జరిగిన అన్యాయం వివరిస్తామన్నారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకాయల ముత్యాలరావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల ఏర్పాటు పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. సర్పంచుల సమస్య లను పరిష్కరించే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిదులు సోమేశ్వరరావు, అప్పలరాజు, అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

కట్టు తప్పుతున్న ఖాకీలు



ఫిర్యాదు వస్తే కొంతమంది సీఐలు, ఎస్ఐలకు పండగ

- కేసు నమోదు కంటే సెటిల్‌మెంట్‌కే ఆరాటం
- ఆ తర్వాత ఇరువర్గాల నుంచి డబ్బులు డిమాండ్
- చోరీ కేసులో వ్యాన్‌ను తప్పించడానికి రూ.3.5 లక్షలు డిమాండ్ చేసినట్టు ఓ ఎస్ఐపై ఆరోపణలు
- తాజాగా కేసు సెటిల్ చేసినందున రూ.10 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ
- స్టేషన్‌లో వ్యవహారాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొంతమంది ఎస్ఐలు, సీఐల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేసేందుకు కృషిచేయాల్సిన అధికారులు తమ స్వలాభం చూసుకుంటున్నారు. తమపై ఉన్నతాధికారులు పెద్దగా దృష్టిపెట్టడం లేదనే భావనతో విచ్చలవిడిగా అక్రమార్జనకు పాల్పడుతున్నారు. కేసు కట్టకుండా సెటిల్‌మెంట్లు చేస్తున్నారు.

కొంతకాలంగా నగరంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారుల నిఘా కొరవడింది. స్టేషన్‌లో స్పెషల్‌బ్రాంచి విభాగం బాధ్యతలు చూసే కానిస్టేబుల్/హెడ్‌కానిస్టేబుల్‌ను అధికారులు మచ్చిక చేసుకుని తమ వ్యవహారాలను బయటకు పొక్కకుండా జాగ్రత్తపడుతున్నారు. స్పెషల్‌బ్రాంచి సిబ్బంది కూడా గతంలో అదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించి ఉండడంతో వారు కూడా అధికారులతో మిలాఖత్ అయిపోతున్నారు. దీంతో కొన్ని స్టేషన్లలో సీఐలు, ఎస్ఐలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. బాధితులకు న్యాయం చేయడం కంటే తమకు ఎంతవరకూ లాభం చేకూరుతుందనే దానిపైనే దృష్టిపెడుతున్నారు. కేసుల నమోదు, దర్యాప్తులో తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై కేసు నమోదుచేయకుండా ఇరు వర్గాలను పిలిచి సెటిల్‌మెంట్లు చేసేందుకు యత్నిస్తున్నారు. తర్వాత ఇరువర్గాల నుంచి డబ్బులు గుంజి జేబులు నింపుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో పెందుర్తి స్టేషన్ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో గల ఐరన్‌ను కొంతమంది అర్ధరాత్రివేళ వ్యాన్‌తో తరలించేందుకు యత్నించారు. అక్కడున్న సెక్యూరిటీ గార్డు వ్యాన్‌ను అడ్డుకోవడంతోపాటు తమ సంస్థ సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వ్యాన్‌తోపాటు కొంతమందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన ... మిగతా 6వ పేజీలో



వుడా చిల్డ్రన్ థియేటర్‌లో జరిగిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నామినేషన్లు, ఎన్నికల ప్రక్రియలపై రాజకీయ పార్టీ ప్రతినిధుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

గీత దాటితే వేటు తప్పదు

ఎన్నికలపై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున

- ప్రచారం, ర్యాలీలు, సభలకు అనుమతులు తప్పనిసరి
- ఇంటింటి ప్రచారానికి కూడా...
- కాన్వాయ్‌లో పది వాహనాలకే అనుమతి
- వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు
- అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు కూడా పాల్గొనకూడదు
- రూ.లక్షకు మించి నగదు బదిలీ జరిగితే నిఘా

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రచారం, ర్యాలీలు, సభలకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టంచేశారు. చివరకు వీధుల్లో ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి ఉండాలన్నారు. ప్రచారంలో ఎంతమంది పాల్గొంటున్నారనే వివరాలు తెలియజేస్తూ సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. బుధవారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల పైకప్పుపై జెండాలు, కటౌట్ల ఏర్పాటుకు కూడా అనుమతి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, శాఖలకు చెందిన ప్రాంగణాలు, వాణిజ్య సముదాయాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ప్రకటనలు, బ్యానర్లు, కటౌట్లు, పోస్టర్ల ఏర్పాటును అనుమతించేది లేదని స్పష్టంచేశారు. రాజకీయ నాయకులు, అభ్యర్థుల కాన్వాయ్‌లో పది వాహనాలకే అనుమతి ఇస్తామన్నారు. ఒకవేళ 30 వాహనాలకు దరఖాస్తు చేస్తే..ప్రతి పది వాహనాలకు మధ్య 300 నుంచి 400 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత జిల్లాలో ఏడు వేల కటౌట్లు, జెండాలు, హోర్డింగ్‌లు తొలగించామన్నారు. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగు వేశామన్నారు. జాతీయ రహదారులు, ప్రధాన రోడ్ల సమీపంలో గల హోర్డింగ్‌లను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున కొత్త ప్రదేశాల్లో హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతించబోమన్నారు. ర్యాలీలకు పాఠశాల మైదానాలు, అతిథిగృహాలు వినియోగించుకోవాలంటే సంబంధిత ఆర్వోకు 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.11
సహరి (శుక్ర)	4.47

వర్షం... నగరానికి ఉపశమనం



తాటిచెట్లపాలెం వద్ద జాతీయ రహదారిపై వర్షం కురుస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఒక మోస్తరు వర్షం కురిసింది. ఉదయం అనేకచోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో భారీవర్షం పడింది. అకాల వర్షంతో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. అయితే కొద్దిరోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన నగరంలో వాతావరణం చల్లబడింది.

శోభన్‌బాబు వర్ధంతి

డాబాగార్డెన్స్, మార్చి 16: సినీ హీరో శోభన్‌బాబు 16వ వర్ధంతి శోభన్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని శోభన్‌బాబు విగ్రహం వద్ద నిర్వహించారు. మేయర్ హరివెంకటకుమారి, గౌరవ సలహాదారు గంట్లశ్రీనుబాబు, పోలారావు, కనకరాజు ఉన్నారు.

ఏళ్ల తరబడి సా..గుతున్న యూజీడీ పనులు

- ఎడాపెడా రోడ్ల తవ్వకాలు
- రాకపోకలకు అవస్థలు

మాధవధార, మార్చి 20; ఉత్తర నియోజకవర్గ పరిధిలోని 2017లో ఆరంభమైన భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (యూజీడీ) పనులు నేటికీ కొలిక్కి రాలేదు. దాదాపు ఎనిమిదేళ్లుగా మురళీనగర్ , మాధవధార ప్రాంతాల్లో జీవీఎంసీనుంచి కాంట్రాక్టు ప్రాతిపదికన ఈ పనులు సాగుతూనే ఉన్నాయి. అధికారికంగా నగరంలో 2008లో ఈ యూజీడీ పనులు ఆరంభించారు. 16 ఏళ్లుగా దిగువ పశ్చిమ నియోజకవర్గ ప్రాంతంలోని కంచరపాలెం, మర్రిపాలెం మెయిన్ రహదారుల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. అనంతరం 2017 నుంచి ఉత్తర నియోజకవర్గంలో మెయిన్ రోడ్లకు విస్తరించారు. అప్పటి నుంచి ఈ పనుల కోసం తీసిన గోతులు, తవ్వకాలతో వీధి రోడ్లు, ప్రధాన మార్గాలు ప్రమాద నిలయాల్లా మారాయి. ఇప్పటికీ ఈ పనుల తర్వాత రోడ్లు పూర్తిస్థాయిలో తిరిగి రూపుదిద్దుకోవడం లేదంటే అతిశయోక్తికాదు. తాజాగా గ్రేటరు 51వ వార్డు ఎస్ఎస్‌టీఎల్ సమీపాన ఎస్టీ హాస్టల్ వద్ద చేపట్టిన పనులతో రహదారులు ఎర్రమట్టితో నిండిపోయాయి. ఇప్పుడు 50వ వార్డు మాధవధార భరద్వాజ కల్యాణమండపం గెడ్డ ప్రాంతం వద్ద నివాసిత ప్రాంతాలను కలుపుతూ యూజీడీ రోడ్ల తవ్వకాలు, గెడ్డ మీదుగా పైపులైన్ల అమరిక, సంపుల నిర్మాణం చేపడుతున్నారు

కాంట్రాక్టర్‌కు రాజకీయ దన్ను

జీవీఎంసీలో మాధవధారకు చెందిన ఓ కార్పొరేటరు సన్నిహిత్యం ఉన్న వ్యక్తి కాంట్రాక్టరు ఈ పనులుచేపడుతున్నారు. దీంతో అధికారులు ఈ పనులను పర్యవేక్షించడంలేదు. ఎంత ఆలస్యం చేస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు. దీనికితోడు పనుల్లో కనీస జాగ్రత్తలు తీసుకోవడంలేదు. తవ్వకాలు చేపడుతున్న చోట ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంలేదు. రాజకీయ నాయకులతో పరిచయం ఉండంతో కాంట్రాక్టరు కనీసం పనుల్లో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే మాట వినిపిస్తోంది. రాత్రి వేళల్లో తవ్వకాలు చేపట్టి వదిలేసిన రోడ్లలో రాకపోకలు ఇబ్బందికరంగా ఉన్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు అటుగా దృష్టి సారించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.


మాధవధారలో పైపులైను కోసం తవ్వకాలు

శివకేశవుల కల్యాణ మహోత్సవం


కన్యాకాపరమేశ్వరి ఆలయంలో దేవరులకు కల్యాణం నిర్వహిసున్న అర్చకులు

మహారాణిపేట, మార్చి 20: వన్‌టౌన్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీ నగరేశ్వరస్వామి, శ్రీ జనార్దన స్వామి దేవేరుల పరిణయ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పూర్వం ఆర్య వైశ్యులు, రుషులు తపస్సుకు శివ పార్వతులు, విష్ణుమూర్తి, లక్ష్మీదేవి మెచ్చి వారి అంశగా ఉన్న నగరేశ్వర స్వామి, వింధ్యావాహిని, శ్రీ జనార్దన స్వామి, కోమలాదేవిలుగా వెలిసినట్టు పురాణ గాథ. అప్పటినుంచి ఆర్యవైశ్యులను శివపార్వతులు రక్షణగా నిలుస్తున్నట్టు ప్రతీతి. ఈసందర్భంగా ప్రతీ రెండేళ్లకోసారి పాల్గుణ శుద్ధ ఏకాదశి రోజు నిర్వహించే శివ కేశవుల వివాహ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, త్రిశూల పూజ, వాస్తు పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ జయదేవి, అంగన్‌వాడీలు, గర్భిణులు

అక్కయ్యపాలెం, మార్చి 20 : గ్రేటర్ 44వ వార్డు ఎంటీ పాలెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ పీడీ డాక్టర్ జయదేవి హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పరిరక్షణంలో జాగ్రత్త వహించాలని కోరారు. ఏడు నెలల పిల్లలకు అన్నప్రాసన చేయాలని సూచించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. పురుషులందరూ పౌష్టికాహార పక్షోత్సవాల వేడుకల్లో భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శారదా దేవి, ఏసీడీపీవో శ్రీలత, ఫుడ్ సేఫ్టీ సెక్యూరిటీ ఆఫీసర్ మాడిశెట్టి దుర్గాదేవి, సూపర్‌వైజర్లు జ్యోతి, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు నబీనా హీరా, లక్ష్మి, లక్ష్మణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అవస్థలు


జలమయమైన రహదారి

మురళీనగర్, మార్చి 20 ; అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిసిన వర్షానికి మాధవధార, పరిసర ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. ఇక్కడి సింహాచల దేవస్థానం నుంచి వేలంపాటలో కేటాయించిన మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు పూత నేల రాలిపోతోందని కౌలుదారులు ఆవేదన వ్యక్తంచేశారు. మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో ఉన్న దిగువనున్న బలహీన వర్గాలకు చెందిన రామన్న కాలనీ, చిట్టిబాబు కాలనీలు, ఎగువన ఎస్ఎస్‌టీఎల్ ప్రాంతాలు ఉడాకాలనీ నుంచి చేరిన గెడ్డ నీటితో ముంపునకు గురయ్యాయి. మరోవైపు జాతీయ రహదారి వద్ద సర్వీసు లైనులో నిలిచిన నీటిలోనే వాహనదారులు ప్రయాణాలు సాగించాల్సి వచ్చింది.

తల్లి చెంతకు నిరాశ్రయురాలు


శాంతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వసతి గృహం నిర్వాహకులు

అక్కయ్యపాలెం, మార్చి 20 : టీస్టార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయురాలు శాంతి ఒడిశాలోని ధేంకనల్ జిల్లా సారంగ్ గ్రామంలోని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. శాంతి గత ఆరేళ్ల క్రితం ఒక బిడ్డ పుట్టగానే ఆమె మానసిక పరిస్థితి పాడైందన్నారు. ఆమెను భర్త వదిలేసి మరో పెళ్లి చేసుకోవడంతో తల్లి దగ్గర ఉండేదని తెలిపారు. తొమ్మిది నెలల క్రితం తల్లితో చిన్న తగాదా చోటుచేసుకోవడంతో ఇంట్లో నుంచి పారిపోయి విశాఖకు వచ్చేసినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 23వ తేదీన వైజాగ్ రైల్వే స్టేషన్‌లో శాంతిని ఆర్పీఎఫ్ పోలీసులు ఏయూటీడీకి అప్పగించారన్నారు. ఆమెను మానసిక ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించడంతో వ్యాధి నయమైందన్నారు. దీంతో ఆమెను శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో ఎట్టకేలకు తల్లి జ్యోత్స్నకు అప్పగించినట్టు వసతి గృహం మేనేజర్ తెలిపారు.

సంస్కృతి, సాహిత్యాల ద్వారా సమాజ పురోగతి

సీతంపేట, మార్చి 20: ఒక దేశం.. ఒక జాతిగా సమాజం ఉండాలంటే, ఆ దేశపు సంస్కృతి, సాహిత్యాన్ని బతికించుకోవాలని సాహితీవేత్త డాక్టర్ ఎం.విజయగోపాల్ అన్నారు.. సీతంపేట ప్రిజమ్ కళాశాలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి పరిరక్షణ సాహిత్యం అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం సంస్థ అధ్యక్షులు శేఖర్‌మంత్రి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన డాక్టర్ విజయగోపాల్ మాట్లాడుతూ సమాజంలో విశిష్ట శక్తి కలిగిన కవులు, కళాకారులు, సాహిత్యకారులు, పండితులు ఆయా సమాజ సంస్కృతిని బతికించే ప్రయత్నాలు చేయాలన్నారు. భారతదేశంలో వ్యక్తిగత, సామాజిక, మానవత్వ, ఆధ్యాత్మిక విలువలు ఉన్నత స్థాయిలో లేకపోవడం వలన సమాజంలో ఇంకా అక్రమాలు, పీడన, హింస తదితర వాటిని చూస్తున్నామన్నారు. శేఖర్‌మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ పరిరక్షణ కోసం వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మూలస్తంభాలై నిలిచాయన్నారు. సాహిత్యం మానవ జీవనంలో ముఖ్య పాత్ర వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేజీ వేణు, డాక్టర్ ఇక్బాల్, విజయ నిర్మాణ కంపెనీ అధినేత డాక్టర్ ఎస్. విజయకుమార్, చిన సూర్యానారాయణ, కొత్తూరి రమణ, డాక్టర్ కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ మోపిదేవి విజయగోపాల్

'ఉత్తరం'లో జోరుగా ఎన్నికల ప్రచారం

మురళీనగర్, మార్చి 20; సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అభ్యర్థులు ప్రచార జోరు పెంచారు. ప్రణాళిక ప్రకారం ప్రజల మధ్య గడిపేస్తున్నారు. ఉత్తర నియోజకవర్గ బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా దాదాపు ఖరారైన మాజీ శాసనసభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెన్మెత్స విష్ణుకుమార్ రాజు 50వవార్డు మాధవధారలో ఇప్పటికే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బిర్లా జంక్షన్‌లో ప్రచారం ఆరంభించారు. ఇక, ప్రతి వార్డులో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకుల సమన్వయంతో ప్రజల మధ్య ఉంటున్నారు. మరో వైపు ప్రత్యర్థిగా ఇదే సామాజికవర్గానికి చెందిన వైసీపీ అభ్యర్థి కమ్మిల కన్నపు.రాజు (కెకె. రాజు) ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. బుధవారం ఈ మేరకు 50 వవార్డులో ఆయన వైశాఖీ పార్కుకి ఉదయం చేరుకున్న ఆయన వాకర్స్‌తో మాట్లాడారు.

వైసీపీని బలపరచాలని కోరారు. అనంతరం మురళీనగర్‌లో నివాసం ఉంటున్న వైసీపీ నాయకులు భరణికాన.రామారావు ఇంట్లో ఉదయం అల్పాహార విందులో పాల్గొన్నారు. ఆయన వెంట 50వవార్డు కార్పొరేటరు వి. ప్రసాద్, పార్టీ మద్దతు దారులు ఉన్నారు.

అంగరంగ వైభవంగా ఉపమాక వెంకన్న కల్యాణోత్సవం

- పోటెత్తిన భక్తులు

నక్కపల్లి, మార్చి 20: ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 3 గంటలకు కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పంచామృతాభిషేకం చేసి, ధూప, దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించిన అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతించారు. ఈ సందర్భంగా గరుడాద్రి పర్వతం మెట్లమార్గం భక్తులతో నిండిపోయింది. ఆలయం లోపల, బయట వున్న క్యూ లైన్లు కిటకిటలాడాయి. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. స్వామి వారిని మధ్యాహ్నం డీఐజీ విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.


స్వర్ణాలంకరణలో దర్శనమిస్తున్న ఉపమాక వెంకన్న


ఆలయ ప్రాంగణంలో భక్తులు

నేత్రపర్వంగా ధ్వజారోహణం

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం ధ్వజారోహణం ఘనంగా జరిగింది. ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయిగోపాలాచార్యులు, నందూరి రాజ గోపాలాచార్యులు పూజలు నిర్వహించారు. అంతకు ముందు పెద్దపల్లకీపై ధ్వజాన్ని అమర్చి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద పూజలు చేసి, ధ్వజారోహణం చేశారు. భక్తులకు పొంగలి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

కూటమి ప్రధాన ఎజెండా సంక్షేమం, అభివృద్ధి

- టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీభరత్


మాట్లాడుతున్న శ్రీభరత్

మహారాణిపేట, మార్చి 20: సంక్షేమంతో కూడిన అభివృద్ధే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎజెండా అని టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఎం. శ్రీ భరత్ అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన బీసీలకు రక్షణ చట్టం, మహిళలకు దీపం పథకం తదితర వాటికి ప్రజలనుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీతో కూడిన కూటమిని బలపరచాలని ఆయన కోరారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ఆర్థిక ప్రయోజనాలకోసం బీజేపీతో టీడీపీ, జనసేనలు కలసి నడవాలని నిర్ణయించుకున్నట్టు వివరించారు. ఈ కూటమి విజయంతో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ పార్టీల ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈసమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుల, ఆదాయ ధ్రువపత్రాలు నిలిపేయడం సరికాదు

- భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యుడు రవి



అక్కయ్యపాలెం, మార్చి 20: ఎన్నికల కోడ్ ఫలితంగా నివాస, జనన, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను నిలిపివేయడం సరికాదని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యుడు జె.రవి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫొటో ఉండడం వల్ల ఈ ధృవీకరణ పత్రాల జారీ నిలిపివేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిబంధనలకు అనుసరించి ఈ ధృవీకరణ ప్రతాలను జారీచేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల కోడ్ సుమారు మూడు నెలలు ఉంటుందని, అంతవరకు విద్యార్థులు, ఇతర వర్గాలు ఇబ్బందులకు లోనుచేయడం సరికాదన్నారు. వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమవుతాయని, అప్పుడు వారి అడ్మిషన్లకు మరిన్ని సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా కలెక్టర్ కార్యాలయంలో నిలిపివేసిన స్పందన కార్యక్రమాన్ని నిబంధనలు అనుసరించి కొనసాగించాలని కోరారు.

ఎల్‌బీ నగర్‌లో హెల్త్ సెంటర్ పునర్నిర్మాణం

సామాజిక భవనంగా మార్పుతో పనులు


చదును చేసిన హెల్త్ సెంటర్ స్థలం

మురళీనగర్, మార్చి 20; గ్రేటర్ 49వవార్డు బర్మా క్యాంపు ఎల్‌బీ నగర్‌లో హెల్త్ సెంటర్ పునర్నిర్మాణ పనులు ఆరంభమయ్యాయి. నలభై ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కొనసాగింది. ఐదేళ్లుగా భవనం శిథిలావస్థకు చేరడంతో ఈ కేంద్రాన్ని మాధవధార 51వ వార్డుకి తరలించారు. అప్పటి నుంచి మిగిలిన భవనం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి.ఈ ఎల్‌బీ నగర్ పీహెచ్‌సీ రెండంతస్తుల భవనం బర్మాక్యాంపు రోడ్డులో నూకాలమ్మ ఆలయం పక్కన ఉంది. ఈ భవనాలు ఇంతవరకు బూత్ బంగ్లాలా మారి పేకాటలకు, మందు బాబులకు అడ్డాగా మారాయి. దీంతో పరిసర నివాసితులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు భవనం పునర్నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. కార్పొరేటరు, వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు చొరవతో రూ. 60 లక్షలు మంజూరయ్యాయి. అయితే, ప్రాథమిక అంచనాతో రెండు అంతస్తుల కమ్యూనిటీ భవనంపేరిట ప్రస్తుతం నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఒక ఫ్లోర్‌లో సచివాలయం ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఏదిఏమైనా ఇటీవల శంకుస్థాపన తర్వాత ఈ పాత భవనం తొలగింపు పనులు పూర్తి కావచ్చాయి. దీని దిగువ బేస్‌మెంట్ ఫ్లోరుని కూడా మూసేశారు. పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఏళ్ల నాటి వృథా భవనం అభివృద్ధికి నోచుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాట ఇచ్చి, మడమ తిప్పి...

... 5వ పేజీ తరువాయి

కె.లోకనాథం విమర్శించారు. రాష్ట్రంలో తాము నాలుగు లక్షల మంది ఉన్నామని, కుటుంబ సభ్యులతో కలిపితే సుమారు పది లక్షల ఓట్లు ఉంటాయన్నారు. తమను మోసం చేసిన ఈ సర్కారుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టంచేశారు. ఐదేళ్ల కిందట ఏర్పాటుచేసిన రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయకుండా ఎందుకు మోసం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

గీత దాటితే వేటు తప్పదు

... 5వ పేజీ తరువాయి

సువిధ యాప్ అందుబాటులో ఉందన్నారు. అయితే ఎవరు ముందుగా అనుమతి కోరితే వారికే తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడదలయ్యేంత వరకూ ప్రచారం ఖర్చు సంబంధిత రాజకీయ పార్టీ ఖాతాలోకి వెళుతుందని, నోటిఫికేషన్ వచ్చిన తరువాత అభ్యర్థి ఖాతా కిందకు వస్తుందని పేర్కొన్నారు. పార్లమెంటు అభ్యర్థికి రూ.90 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థికి రూ.40 లక్షలు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఎన్నికల విధుల్లో తప్ప ఇతరత్రా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని స్పష్టంచేశారు. ఇప్పటివరకు జిల్లాలో సీ విజిల్ యాప్ ద్వారా 12 ఫిర్యాదులు వచ్చాయన్నారు. అభ్యర్థి, ఏజెంట్లు, అనుచరుల వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని, వస్తు రూపేణా రూ.10 వేలకు మించి ఉండరాదని, విరాళాలు రూ.20 వేలకు మించి స్వీకరించరాదన్నారు. రూ.లక్షకు మించి నగదు బదిలీ జరిగితే నిఘా ఉంటుందని, వెంటనే ఆదాయ పన్ను శాఖకు తెలియజేస్తామన్నారు. ఎన్నికలపై కథనాలు ప్రచురించే ముందు రిటర్నింగ్ అధికారి నుంచి సరైన సమాచారం తీసుకోవాలని మీడియా ప్రతినిధులకు సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ఎనిమిది టీమ్‌లు పనిచేస్తాయన్నారు. నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నగర సీపీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సభలు, ర్యాలీలు, వాటికి వినియోగించే లౌడ్‌స్పీకర్లకు ఆర్వో అనుమతి ఉండాలన్నారు. ఎవరైనాతప్పుడు ఫిర్యాదులు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మతపరమైన గొడవలు, వ్యక్తిగత తగాదాలు ఉండరాదని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ మాట్లాడుతూ నామినేషన్ల దాఖలు సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులైతే ఒక్కరు ప్రతిపాదిస్తే సరిపోతుందని, అదే ఇండిపెండెంట్లు అయితే పది మంది ప్రతిపాదించాలన్నారు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన ధరావత్తులో నగం చెల్లిస్తే సరిపోతుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కట్టు తప్పుతున్న ఖాకీలు

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి క్రైమ్ ఎస్ఐ ఈ కేసులో పట్టుబడిన వ్యాన్‌ను తప్పించేందుకు రూ.3.5 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులు శాఖాపరంగా అంతర్గత విచారణకు ఆదేశించగా వాస్తవమేనని తేలింది. అయితే ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అతడిని వీఆర్‌కు సరండర్ చేసి చేతులు దులుపుకున్నారు. తన కారు కొనుకున్న వ్యక్తి సరిగా బ్యాంకు వాయిదాలు కట్టడం లేదంటూ తాజాగా ఒకరు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదుచేయకుండా ఇరువర్గాలను పిలిచి సెటిల్ చేశారు. అందుకోసం తనకు రూ.పది వేలు లంచం ఇవ్వాలంటూ బాధితుడిని డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఇలాంటి ఉదంతాలు నగరంలోని చాలా స్టేషన్లలో జరుగుతున్నాయని, ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని పోలీస్ శాఖలోనే కొంతమంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



సమావేశంలో పాల్గొన్న క్లాప్ వాహనాల డ్రైవర్లు

క్లాప్ వాహనాల డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ నాయకుల విజ్ఞప్తి

గాజువాక, మార్చి 20: జీవీఎంసీలో క్లాప్ వాహనాల డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ముందుకు రావాలని సీఐటీయూ నాయకులు కోరారు. క్లాప్ డ్రైవర్ల సర్వసభ్య సమావేశం బుధవారం గాజువాకలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గతంలో 16 రోజుల పాటు సమ్మె చేశామని, ఆ సమయంలో ఒక కమిటీ వేసి వాటిని పరిష్కరిస్తామని అధికారులు ఇచ్చారన్నారు. అయితే రోజులు గడుస్తున్నా ఆ హామీ అమలుకు నోచుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, నాగరాజు, హేమకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణుని ఆలయ ఉత్సవాలు

కూర్మన్నపాలెం, మార్చి 20: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో శ్రీకృష్ణ గోవర్ధనగిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయగణపతి, రమా సత్యనారాయణస్వామి, శ్రీకృష్ణ గోవర్ధనగిరి ఆలయంలో షష్ఠి వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. రుక్మిణి,సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణాన్ని వైభవంగా జరిపారు. హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. పలువురు మహిళలు అన్నమాచార్యుని గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు కరణం కనకారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కె.సహదేవరావు, ఎ.సూర్యనారాయణ, పంచముఖేశ్వరరావు, బి.లక్ష్మణ రాజు, శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సాగర్‌నగర్, మార్చి 20 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ (జిబాట్) జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్టు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ప్రవేశ పరీక్షను ఈనెల 24న దేశవ్యాప్తంగా 80 పట్టణాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రవేశపరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు.ప్రతిభ చూపిన వారికి ఉపకార వేతనాలు అందజేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను సంప్రతించాలని ఆయన సూచించారు.

ఇళ్ల పన్ను వడ్డీ మినహాయింపును సద్వినియోగం చేసుకోండి: జెడ్సీ

వేపగుంట మార్చి 20: వేపగుంట జోన్-8 పరిధిలోని ఇళ్ల పన్ను, ఖాళీ స్థలాలపై ఉన్న బకాయిలపై ఉన్న వడ్డీని మాఫీ చేసినందున ఈ అవకాశాన్ని యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్సీ కె.హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్నేళ్లుగా బకాయి పడిన ప్రైవేట్ సంస్థలు, కంపెనీలు, భవన నిర్మాణదారులు,ఇతర పన్ను చెల్లింపుదారులు ఈ వడ్డీ రాయితీ పొందాలన్నారు. ఈ అవకాశం ఈనెల 31వరకు మాత్రమే ఉంటుందని, ప్రతీ ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23,టమాటా 15, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 32, బీరకాయలు 34, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారెట్ 26, దొండకాయలు 22, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 144, బరబాటి 18, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 24, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 65, కరివేపాకు(కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడి కాయ 26, కర్రపెండలం 24, మామిడిఅల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 90
ఫారం ధర	-- 110
విత్ స్కిన్	-- 190
స్కిన్‌లెస్	-- 200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఉక్కు ఉద్యోగులకు వేతన సవరణ జరిగేనా?

- ఎన్‌జేసీఎస్‌లో ఒప్పందం జరిగి ఏడేళ్లవుతున్నా అమలుకు నోచుకోని వైనం
- తీవ్ర నిరాశ, నిస్పృహలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు



ఉక్కుటౌన్‌షిప్, మార్చి 20: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల (నాన్-ఎగ్జిక్యూటివ్స్)కు నూతన వేతన సవరణ ఇప్పట్లో జరిగే సూచనలు కనిపించడం లేదు. దీంతో నూతన వేతనాల అమలు కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు మాత్రం నిరాశే మిగులుతుంది. గత ఏడేళ్లగా అదిగో అయిపోయింది.. ఇదిగో అయిపోయిందన్న కబుర్లే తప్ప ఏదీ అమలుకు నోచుకోవడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉక్కు ఉద్యోగులకు 2017 జనవరి ఒకటి నుంచి నూతన వేతనాలు అమలు జరగాల్సి ఉంది. నాటి నుంచి 2021 వరకు ఎన్‌జేసీఎస్‌లో పలుమార్లు చర్చలు జరగడంతో చివరకు 2021 అక్టోబరులో నూతన వేతనాల అంశం ఒక కొలిక్కి వచ్చి కార్మిక సంఘాలు, అధికారుల మధ్య ఒప్పందం జరిగింది. ఈ మేరకు సెయిల్‌లో మాదిరిగానే స్టీల్‌ప్లాంట్‌లో నూతన వేతనాలు అమలులోకి వస్తాయని కార్మిక వర్గమంతా ఎంతో ఆశతో ఎదురుచూసింది. ప్రతి విషయంలో సెయిల్‌లో జరిగినట్టే స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలు అమలు జరుగుతాయి. కానీ ఈసారి వేతన సవరణ విషయంలో అలా జరగలేదు. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పరిస్థితులు బాగోలేనందున ఇక్కడ కొత్త వేతనాలు అమలుకు నోచుకోలేదు. ఉక్కు ఉద్యోగులకు నూతన వేతనాలను అందించాలంటూ కార్మిక సంఘ నాయకులు, కార్మికులు పలుమార్లు పెద్దఎత్తున ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అయితే స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పరిస్థితి మెరుగుపడ్డాక ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు వేతన సవరణ చేస్తామని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో ఏం చేయాలో కార్మిక సంఘాల నాయకులకు అర్థం కాలేదు. ఇప్పటికే నూతన వేతనాలను ఏడేళ్లగా నష్టపోతూ వస్తున్నామని, ఇలా ఇంకెంత కాలం నష్టపోవాలని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. కాగా స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితులను చూస్తే మాత్రం నూతన వేతనాల సవరణ ఇప్పట్లో అమలు జరిగేలా కనిపించడం లేదని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు.

'ప్రజాగళం' సభ భద్రతా వైఫల్యాలపై దర్యాప్తు జరపాలి

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 20: ప్రజాగళం సభ భద్రతా వైఫల్యాలపై ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టాలంటూ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట వద్ద జరిగిన ప్రజాగళం సభలో ప్రధాని మోదీ పాల్గొన్నప్పటికీ పూర్తి స్థాయిలో భద్రత లోపించిందని, దీనిపై ఉన్నత స్థాయిలో దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి,దుర్మార్గాలు,దోపిడీలు కొనసాగుతున్నాయని, అతి త్వరలోనే ప్రజలకు మంచి రోజులు రానున్నాయన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా రానున్నది టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ప్రభుత్వమేనన్నారు. సమావేశంలో కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు శంకరరావు, గోమాడ వాసు, కృష్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి అమ్మవార్ల ఆలయంలో వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు, తదితరులు

కూర్మన్నపాలెం, మార్చి 20: జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురంలో బుధవారం దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లమ్మ అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పర్యవేక్షణలో మూలమంత్ర హోమాలు, గర్త న్యాసం, ధాతున్యాసం, బీజన్యాసం, యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, సారె ఊరేగింపు కార్యక్రమాలను చేపట్టారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. గాజువాక నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనువాసరావు, కార్పొరేటర్ బొండా జగన్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయగా, ఎ.సూర్యనారాయణ, కె.రామరాజు, ఎస్.బాబూరావు, ఎ.పెంటారావు, బి.అప్పలరాజు, ఐ.సన్యాసిరాజు, బీవీఆర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఈ-మర్రిపాలెం బస్టాప్ కూడలిలో గల రుణ విమోచన లక్ష్మీగణపతిస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని నూతన వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి హోమం, పంచామృతాభిషేకాలు జరిపారు. సామూహిక లలితాసహస్రనామ పారాయణాన్ని పలువురు భక్తులు పఠించారు. మంత్రి, వైసీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, గాజువాక ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దానబోయిన అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో 'పల్లా' ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ: ఇక్కడి బాలచెరువు వద్దనున్న ఉమారామలింగేశ్వరాలయంలో 'గాజువాక' ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రామరాజ్య స్థాపనకు కృషి చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి దేవుళ్ల సహకరించాలని కోరారు. అనంతరం బాలచెరువు కాలనీలో పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, నాయకులు పులి వెంకట రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు, ఎం.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేద్దాం'

పెదగంట్యాడ, మార్చి 20: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేద్దామని డీసీసీ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన నాయుడు విజ్ఞప్తి చేశారు. సమతానగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికార వైసీపీ చేసిన తప్పులు, తెలుగుదేశం. జనసేన, బీజేపీలు చేసిన పొరపాట్లను కాంగ్రెస్‌పైకి నెట్టే యత్నాలు జరుగుతున్నాయని,వీటిని తిప్పికొట్టేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఇంటక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి అచ్చిబాబు పాల్గొన్నారు.

పనిచేయని ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి సొబగులు!

- సీఎం వస్తున్నారని ఆగమేఘాలపై రంగులు..
- విద్యుత్ దీపాల అలంకరణ
- అవాక్కవుతున్న జనాలు



నాయుడుతోట కృష్ణానగర్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జికి విద్యుత్తు వెలుగులు

వేపగుంట మార్చి 20: నాయుడుతోట కృష్ణానగర్ బీఆర్‌టీఎస్ రోడ్డులో పనిచేయని ఫుట్ ఓవర్ బ్రిడ్జికి రంగులు వేసి, విద్యుతు దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మరీ అధికారులు తమ గొప్పతనాన్ని చాటుకున్నారు. కృష్ణానగర్ వద్ద ఐదేళ్లకిందట ఏర్పాటుచేసిన ఈఫుట్ ఓవర్ బ్రిడ్జికి సరైన ల్యాండింగ్ సదుపాయం లేదు. దీనిని ఏ ఒక్కరూ వినియోగించటం లేదు. ఒకవైపున దిగటానికి సరైన ప్రదేశం కానరావడంలేదు. బ్రిడ్జిపై ఉన్న పలకలను కొంతమంది గతంలో అపహరించుకుపోయిన విషయం విదితమే. ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శారదా పీఠం సందర్శించడానికి వచ్చినప్పుడు ఆగమేఘాల మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో అటూఇటూ ఉన్నరెయిలింగ్, గోడలకు రంగులు వేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండే వాటికి మరమ్మతు చేప్పటినా అర్థం ఉంటుంది. అలా కాకుండా ఎవరూ వినియోగించని ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి రంగులు, వీటికి విద్యుత్తు వెలుగులు తదితర ఏర్పాటుకు రూ. లక్షల్లో ఖర్చు చేయడంతో పలువురు అవాక్కవుతున్నారు. ప్రతిరోజూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైన రాకపోకలు సాగించకున్నా దాదాపు 20కు పైగా ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయడం గమనార్హం. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రంగులు తొలగించలేరు. కనీసం రాత్రి పూట విద్యుత్తు దీపాల కనెక్షన్ తొలగించి ప్రజాధనం వృథాను స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఒకటే ముసురు..



కొత్తపాలెం అండర్‌పాస్‌వే వద్ద చేరిన వర్షం నీరు

గోపాలపట్నం, మార్చి 10: ఉపరితల ఆవర్తన ప్రభావంతో గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ముసురు ప్రభావం కనిపించింది. వర్షం ప్రభావంతో ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్ వ్యాపారాలు డీలా పడ్డాయి. అదే విధంగా ప్రధాన రహదారిలో సముదాయాల్లో కూడా వ్యాపారం మందకొడిగా సాగింది. రోజు కూలీలు, చిరు వ్యాపారులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యులు

గోపాలపట్నం, మార్చి 20: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం (ఓరల్ హెల్త్ డే) పురస్కరించుకుని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యురాలు వనితా పావని పలువురికి బుధవారం దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉదయం, రాత్రి రెండు పూటలా దంతాలను శుభ్రం చేసుకోవాలని, ఏదైనా పంటి సమస్య వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు చేపట్టిన ర్యాలీని ఆస్పత్రి వైద్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఇందిరానగర్ వద్ద జారిపడుతున్న కొండచరియలు
- భీతిల్లుతున్న స్థానికులు



ఇందిరానగర్‌లో బైపాస్ వద్ద ఓ ఇంటి కింద జారిపోతున్న కొండ



ఇదే ప్రాంతంలో కూలడానికి సిద్ధంగా ఉన్న కొండచరియ

గోపాలపట్నం, మార్చి 20: స్థానిక కుమారి కల్యాణ మంపడం సమీపం నుంచి ఇందిరానగర్ మీదుగా ఎన్ఎస్‌టీఎల్ వరకూ బైపాస్ రహదారి నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాలు ప్రమాదకరంగా మారాయి. బైపాస్ రహదారిని సింహాచలం ప్రధాన రహదారికి కలపడానికి ఇందిరానగర్‌లోని కొన్ని గృహాలను తొలగించి నాలుగేళ్ల కిందట కొండవాలు ప్రాంతంలో తవ్వకాలు చేపట్టారు. అయితే, ఈ తవ్వకాలు చేపట్టిన చోట ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రసుతం ఈ ప్రాంతంలోని కొన్ని జనావాసాలు ప్రమాదపు అంచుకు చేరాయి. తవ్వకాలుచేపట్టిన చోట రిటైనింగ్ వాల్‌గాని, రాతిపేర్పుగాని ఏర్పాటు చేయకపోవడంతో వర్షం కురిస్తే ఈ ప్రాం తంలో కొండచరియలు జారిపడుతున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు భీతిల్లుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే తగు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



కణితి రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

ఉరుములతో కూడిన వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

గాజువాక, మార్చి 20: పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో బుధవారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కొంత ఉపశమనం లభించింది. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మబ్బులతో నిండి ఉండి అప్పడప్పుడు చిన్నపాటి చిరుజల్లులు కురిశాయి. అయితే నాలుగు గంటల సమయంలో ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడంతో వాహనదారులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

'పల్లా'ను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇద్దాం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్



వడ్లపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, మార్చి 20: త్వరలో జరగనున్న ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును గెలిపించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు కానుకగా ఇచ్చేందుకు కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కోరారు. వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన ముఖ్య కార్యకర్తలు, బూతు ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఒకసారి నమ్మి జగన్‌కు ప్రజలు అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని అధ్వానంగా మార్చిన విషయన్ని ప్రజలు ఇప్పటికే గ్రహించారన్నారు. వైసీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు గానీ వలంటీర్లు కానీ పాల్గొంటే సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌కు 96 శాతం మంది వివరాలు అందజేత

76 శాతం మంది నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు కూడా..

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 20: స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్ హాజరును అధికారులు అమలు చేస్తున్నారు. ప్లాంట్‌లో మొత్తం 4,403 మంది అధికారులు విధులు నిర్వహిస్తుండగా ఇప్పటివరకు 4,235 మంది (96.18 శాతం) బయోమెట్రిక్ హాజరుకు తమ వివరాలను అందజేశారు. అదేవిధంగా 9,154 మంది నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు గాను 6,715 మంది (73.36 శాతం) బయోమెట్రిక్ హాజరుకు వివరాలు అందజేశారు. మిగిలిన ఉద్యోగులు కూడా తమ ఐడెండిటీని ఇవ్వాలని ఉక్కు ఉన్నతాధికారులు సూచించారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్‌తో పాటు డార్స్ విధానం కూడా కొనసాగుతున్నది.

వైసీపీలో వలస నేతలే లేరా...?

- పెందుర్తి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల రమేశ్‌బాబు



సరిపల్లి శివాలయంలో పూజల్లో పాల్గొన్న పంచకర్ల

పెందుర్తి, మార్చి 20: వైసీపీలో వలస నేతలు లేరా..? స్థానికేతరులు పోటీ చేయటంలేదా? టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో ఆపార్టీ నేతలు అయోమయ స్థితిలో ఇలాంటి అర్థరహిత ఆరోపణలకు చేస్తున్నారని పెందుర్తి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల రమేశ్‌బాబు విమర్శించారు. మండలంలోని సరిపల్లిలోని శివాలయాన్ని బుధవారం పంచకర్ల దర్శించుకున్నారు. శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన స్థానికతపై ఆరోపణలుచేసిన నేతపై ఆయన ధ్వజమెత్తారు. విశాఖలో వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ తూర్పు, భీమునిపట్నంలలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంవీ సత్యనారాయణ, అవంతి శ్రీనివాసరావు ఎక్కడి వారని ప్రశ్నించారు. పెందుర్తిలో ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజల ఆదరణ పొంది మళ్లీ ఇక్కడ నుంచి పోటీచేస్తున్న తనను రాజకీయంగా ఎదుర్కోలేక స్థానికత గురించి మాట్లాడుతున్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కొనలేక తనపై విషప్రచారం చేస్తున్న వారుచేసిన రాజకీయ దోపిడీ, దందాలపై చెప్పాలంటే మైకులు మూగపోతాయని పరోక్షంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు అయిత సింహాచలం, గొర్లె రమేశ్, పర్రి శివ, టీడీపీ నేతలు ఆకుల అప్పారావు, నీలంశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం సరిచేశారు..



విమాన్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభం

ఎన్.ఎ.డీ జంక్షన్ మార్చి 20: జీవీఎంసీ 90వ వార్డు పరిధి విమాన్‌నగర్ 5వలైన్‌లో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభానికి మోక్షం లభించింది. ఈ స్తంభం పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. హుద్‌హుద్ సమయంలో గాలులకు ఈ స్తంభం పక్కకు ఒరిగి పోయింది. ప్రమాదకర స్థితిలో ఉన్న ఈ స్తంభాన్ని ఎట్టకేలకు మార్చడంపై కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెందుర్తిలో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పెందుర్తి, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం, అనకాపల్లి పార్లమెంట్ నియోజవర్గాలకు సంబంధించి పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శైషశైలజ తెలిపారు. ఎన్నికలకు నిర్వహణకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులు, సూచనలు, అత్యవసర అంశాలను స్వీకరిస్తామన్నారు. ఇందుకోసం హెల్ప్‌లైన్ నంబర్ :9063783289 సంప్రదించాలని ఈసందర్భంగా ఆమె కోరారు.

శోభన్‌బాబు వర్ధంతి

డాబాగార్డెన్స్, మార్చి 16: సినీ హీరో శోభన్‌బాబు 16వ వర్ధంతి శోభన్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని శోభన్‌బాబు విగ్రహం వద్ద నిర్వహించారు. మేయర్ హరివెంకటకుమారి, గౌరవ సలహాదారుగంట్లశ్రీనుబాబు, పోలారావు, కనకరాజు ఉన్నారు.

ఏళ్ల తరబడి సా..గుతున్న యూజీడీ పనులు

- ఎడాపెడా రోడ్ల తవ్వకాలు
- రాకపోకలకు అవస్థలు

మాధవధార, మార్చి 20; ఉత్తర నియోజకవర్గ పరిధిలోని 2017లో ఆరంభమైన భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (యూజీడీ) పనులు నేటికీ కొలిక్కి రాలేదు. దాదాపు ఎనిమిదేళ్లుగా మురళీనగర్ , మాధవధార ప్రాంతాల్లో జీవీఎంసీనుంచి కాంట్రాక్టు ప్రాతిపదికన ఈ పనులు సాగుతూనే ఉన్నాయి. అధికారికంగా నగరంలో 2008లో ఈ యూజీడీ పనులు ఆరంభించారు. 16 ఏళ్లుగా దిగువ పశ్చిమ నియోజకవర్గ ప్రాంతంలోని కంచరపాలెం, మర్రిపాలెం మెయిన్ రహదారుల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. అనంతరం 2017 నుంచి ఉత్తర నియోజకవర్గంలో మెయిన్ రోడ్లకు విస్తరించారు. అప్పటి నుంచి ఈ పనుల కోసం తీసిన గోతులు, తవ్వకాలతో వీధి రోడ్లు, ప్రధాన మార్గాలు ప్రమాద నిలయాల్లా మారాయి. ఇప్పటికీ ఈ పనుల తర్వాత రోడ్లు పూర్తిస్థాయిలో తిరిగి రూపుదిద్దుకోవడం లేదంటే అతిశయోక్తికాదు. తాజాగా గ్రేటరు 51వ వార్డు ఎస్ఎస్‌టీఎల్ సమీపాన ఎస్టీ హాస్టల్ వద్ద చేపట్టిన పనులతో రహదారులు ఎర్రమట్టితో నిండిపోయాయి. ఇప్పుడు 50వ వార్డు మాధవధార భరద్వాజ కల్యాణమండపం గెడ్డ ప్రాంతం వద్ద నివాసిత ప్రాంతాలను కలుపుతూ యూజీడీ రోడ్ల తవ్వకాలు, గెడ్డ మీదుగా పైపులైన్ల అమరిక, సంపుల నిర్మాణం చేపడుతున్నారు

కాంట్రాక్టర్‌కు రాజకీయ దన్ను

జీవీఎంసీలో మాధవధారకు చెందిన ఓ కార్పొరేటరు సన్నిహిత్యం ఉన్న వ్యక్తి కాంట్రాక్టరు ఈ పనులుచేపడుతున్నారు. దీంతో అధికారులు ఈ పనులను పర్యవేక్షించడంలేదు. ఎంత ఆలస్యం చేస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు. దీనికితోడు పనుల్లో కనీస జాగ్రత్తలు తీసుకోవడంలేదు. తవ్వకాలు చేపడుతున్న చోట ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంలేదు. రాజకీయ నాయకులతో పరిచయం ఉండంతో కాంట్రాక్టరు కనీసం పనుల్లో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే మాట వినిపిస్తోంది. రాత్రి వేళల్లో తవ్వకాలు చేపట్టి వదిలేసిన రోడ్లలో రాకపోకలు ఇబ్బందికరంగా ఉన్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు అటుగా దృష్టి సారించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.


మాధవధారలో పైపులైన్ కోసం తవ్వకాలు

శివకేశవుల కల్యాణ మహోత్సవం


కన్యాకాపరమేశ్వరి ఆలయంలో దేవరులకు కల్యాణం నిర్వహిసున్న అర్చకులు

మహారాణిపేట, మార్చి 20: వన్‌టౌన్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీ నగరేశ్వరస్వామి, శ్రీ జనార్దన స్వామి దేవేరుల పరిణయ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పూర్వం ఆర్య వైశ్యులు, రుషులు తపస్సుకు శివ పార్వతులు, విష్ణుమూర్తి, లక్ష్మీదేవి మెచ్చి వారి అంశగా ఉన్న నగరేశ్వర స్వామి, వింధ్యావాహిని, శ్రీ జనార్దన స్వామి, కోమలాదేవిలుగా వెలిసినట్టు పురాణ గాథ. అప్పటినుంచి ఆర్యవైశ్యులను శివపార్వతులు రక్షణగా నిలుస్తున్నట్టు ప్రతీతి. ఈసందర్భంగా ప్రతీ రెండేళ్లకోసారి ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజు నిర్వహించే శివ కేశవుల వివాహ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, త్రిశూల పూజ, వాస్తు పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ జయదేవి, అంగన్‌వాడీలు, గర్భిణులు

అక్కయ్యపాలెం, మార్చి 20 : గ్రేటర్ 44వ వార్డు ఎంటీ పాలెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ పీడీ డాక్టర్ జయదేవి హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పరిరక్షణంలో జాగ్రత్త వహించాలని కోరారు. ఏడు నెలల పిల్లలకు అన్నప్రాసన చేయాలని సూచించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. పురుషులందరూ పౌష్టికాహార పక్షోత్సవాల వేడుకల్లో భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శారదా దేవి, ఏసీడీపీవో శ్రీలత, ఫుడ్ సేఫ్టీ సెక్యూరిటీ ఆఫీసర్ మాడిశెట్టి దుర్గాదేవి, సూపర్‌వైజర్లు జ్యోతి, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు నబీనా హీరా, లక్ష్మి, లక్ష్మణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అవస్థలు


జలమయమైన రహదారి

మురళీనగర్, మార్చి 20 ; అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిసిన వర్షానికి మాధవధార, పరిసర ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. ఇక్కడి సింహాచల దేవస్థానం నుంచి వేలంపాటలో కేటాయించిన మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు పూత నేల రాలిపోతోందని కౌలుదారులు ఆవేదన వ్యక్తంచేశారు. మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో ఉన్న దిగువనున్న బలహీన వర్గాలకు చెందిన రామన్న కాలనీ, చిట్టిబాబు కాలనీలు, ఎగువన ఎస్ఎస్‌టీఎల్ ప్రాంతాలు ఉడాకాలనీ నుంచి చేరిన గెడ్డ నీటితో ముంపునకు గురయ్యాయి. మరోవైపు జాతీయ రహదారి వద్ద సర్వీసు లైనులో నిలిచిన నీటిలోనే వాహనదారులు ప్రయాణాలు సాగించాల్సి వచ్చింది.

తల్లి చెంతకు నిరాశ్రయురాలు


శాంతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వసతి గృహం నిర్వాహకులు

అక్కయ్యపాలెం, మార్చి 20 : టీస్టార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయురాలు శాంతి ఒడిశాలోని ధేంకనల్ జిల్లా సారంగ్ గ్రామంలోని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. శాంతి గత ఆరేళ్ల క్రితం ఒక బిడ్డ పుట్టగానే ఆమె మానసిక పరిస్థితి పాడైందన్నారు. ఆమెను భర్త వదిలేసి మరో పెళ్లి చేసుకోవడంతో తల్లి దగ్గర ఉండేదని తెలిపారు. తొమ్మిది నెలల క్రితం తల్లితో చిన్న తగాదా చోటుచేసుకోవడంతో ఇంట్లో నుంచి పారిపోయి విశాఖకు వచ్చేసినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 23వ తేదీన వైజాగ్ రైల్వే స్టేషన్‌లో శాంతిని ఆర్పీఎఫ్ పోలీసులు ఏయూటీడీకి అప్పగించారన్నారు. ఆమెను మానసిక ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించడంతో వ్యాధి నయమైందన్నారు. దీంతో ఆమెను శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో ఎట్టకేలకు తల్లి జ్యోత్స్నకు అప్పగించినట్టు వసతి గృహం మేనేజర్ తెలిపారు.

సంస్కృతి, సాహిత్యాల ద్వారా సమాజ పురోగతి

సీతంపేట, మార్చి 20: ఒక దేశం.. ఒక జాతిగా సమాజం ఉండాలంటే, ఆ దేశపు సంస్కృతి, సాహిత్యాన్ని బతికించుకోవాలని సాహితీవేత్త డాక్టర్ ఎం.విజయగోపాల్ అన్నారు.. సీతంపేట ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి పరిరక్షణ సాహిత్యం అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం సంస్థ అధ్యక్షులు శేఖర్‌మంత్రి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన డాక్టర్ విజయగోపాల్ మాట్లాడుతూ సమాజంలో విశిష్ట శక్తి కలిగిన కవులు, కళాకారులు, సాహిత్యకారులు, పండితులు ఆయా సమాజ సంస్కృతిని బతికించే ప్రయత్నాలు చేయాలన్నారు. భారతదేశంలో వ్యక్తిగత, సామాజిక, మానవత్వ, ఆధ్యాత్మిక విలువలు ఉన్నత స్థాయిలో లేకపోవడం వలన సమాజంలో ఇంకా అక్రమాలు, పీడన, హింస తదితర వాటిని చూస్తున్నామన్నారు. శేఖర్‌మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ పరిరక్షణ కోసం వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మూలస్తంభాలై నిలిచాయన్నారు. సాహిత్యం మానవ జీవనంలో ముఖ్య పాత్ర వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేజీ వేణు, డాక్టర్ ఇక్బాల్, విజయ నిర్మాణ కంపెనీ అధినేత డాక్టర్ ఎస్. విజయకుమార్, చిన సూర్యానారాయణ, కొత్తూరి రమణ, డాక్టర్ కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ మోపిదేవి విజయగోపాల్

'ఉత్తరం'లో జోరుగా ఎన్నికల ప్రచారం

మురళీనగర్, మార్చి 20; సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అభ్యర్థులు ప్రచార జోరు పెంచారు. ప్రణాళిక ప్రకారం ప్రజల మధ్య గడిపేస్తున్నారు. ఉత్తర నియోజకవర్గ బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా దాదాపు ఖరారైన మాజీ శాసనసభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెన్మెత్స విష్ణుకుమార్ రాజు 50వవార్డు మాధవధారలో ఇప్పటికే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బిర్లా జంక్షన్‌లో ప్రచారం ఆరంభించారు. ఇక, ప్రతి వార్డులో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకుల సమన్వయంతో ప్రజల మధ్య ఉంటున్నారు. మరో వైపు ప్రత్యర్థిగా ఇదే సామాజికవర్గానికి చెందిన వైసీపీ అభ్యర్థి కమ్మిల కన్నపు.రాజు (కెకె. రాజు) ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. బుధవారం ఈ మేరకు 50 వవార్డులో ఆయన వైశాఖీ పార్కుకి ఉదయం చేరుకున్న ఆయన వాకర్స్‌తో మాట్లాడారు.

వైసీపీని బలపరచాలని కోరారు. అనంతరం మురళీనగర్‌లో నివాసం ఉంటున్న వైసీపీ నాయకులు భరణికాన.రామారావు ఇంట్లో ఉదయం అల్పాహార విందులో పాల్గొన్నారు. ఆయన వెంట 50వవార్డు కార్పొరేటరు వి. ప్రసాద్, పార్టీ మద్దతు దారులు ఉన్నారు.

అంగరంగ వైభవంగా ఉపమాక వెంకన్న కల్యాణోత్సవం

- పోటెత్తిన భక్తులు

నక్కపల్లి, మార్చి 20: ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 3 గంటలకు కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పంచామృతాభిషేకం చేసి, ధూప, దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించిన అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతించారు. ఈ సందర్భంగా గరుడాద్రి పర్వతం మెట్లమార్గం భక్తులతో నిండిపోయింది. ఆలయం లోపల, బయట వున్న క్యూ లైన్లు కిటకిటలాడాయి. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. స్వామి వారిని మధ్యాహ్నం డీఐజీ విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.


స్వర్ణాలంకరణలో దర్శనమిస్తున్న ఉపమాక వెంకన్న


ఆలయ ప్రాంగణంలో భక్తులు

నేత్రపర్వంగా ధ్వజారోహణం

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం ధ్వజారోహణం ఘనంగా జరిగింది. ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయిగోపాలాచార్యులు, నందూరి రాజ గోపాలాచార్యులు పూజలు నిర్వహించారు. అంతకు ముందు పెద్దపల్లకీపై ధ్వజాన్ని అమర్చి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద పూజలు చేసి, ధ్వజారోహణం చేశారు. భక్తులకు పొంగలి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

కూటమి ప్రధాన ఎజెండా సంక్షేమం, అభివృద్ధి

- టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీభరత్


మాట్లాడుతున్న శ్రీభరత్

మహారాణిపేట, మార్చి 20: సంక్షేమంతో కూడిన అభివృద్ధే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎజెండా అని టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఎం. శ్రీ భరత్ అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన బీసీలకు రక్షణ చట్టం, మహిళలకు దీపం పథకం తదితర వాటికి ప్రజలనుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీతో కూడిన కూటమిని బలపరచాలని ఆయన కోరారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ఆర్థిక ప్రయోజనాలకోసం బీజేపీతో టీడీపీ, జనసేనలు కలసి నడవాలని నిర్ణయించుకున్నట్టు వివరించారు. ఈ కూటమి విజయంతో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ పార్టీల ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈసమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుల, ఆదాయ ధ్రువపత్రాలు నిలిపేయడం సరికాదు

- భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యుడు రవి



అక్కయ్యపాలెం, మార్చి 20: ఎన్నికల కోడ్ ఫలితంగా నివాస, జనన, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను నిలిపివేయడం సరికాదని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యుడు జె.రవి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫొటో ఉండడం వల్ల ఈ ధృవీకరణ పత్రాల జారీ నిలిపివేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిబంధనలకు అనుసరించి ఈ ధృవీకరణ ప్రతాలను జారీచేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల కోడ్ సుమారు మూడు నెలలు ఉంటుందని, అంతవరకు విద్యార్థులు, ఇతర వర్గాలు ఇబ్బందులకు లోనుచేయడం సరికాదన్నారు. వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమవుతాయని, అప్పుడు వారి అడ్మిషన్లకు మరిన్ని సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా కలెక్టర్ కార్యాలయంలో నిలిపివేసిన స్పందన కార్యక్రమాన్ని నిబంధనలు అనుసరించి కొనసాగించాలని కోరారు.

ఎల్‌బీ నగర్‌లో హెల్త్ సెంటర్ పునర్నిర్మాణం

సామాజిక భవనంగా మార్పుతో పనులు

మురళీనగర్, మార్చి 20; గ్రేటర్ 49వవార్డు బర్మా క్యాంపు ఎల్‌బీ నగర్‌లో హెల్త్ సెంటర్ పునర్నిర్మాణ పనులు ఆరంభమయ్యాయి. నలభై ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కొనసాగింది. ఐదేళ్లుగా భవనం శిథిలావస్థకు చేరడంతో ఈ కేంద్రాన్ని మాధవధార 51వ వార్డుకి తరలించారు. అప్పటి నుంచి మిగిలిన భవనం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి.ఈ ఎల్‌బీ నగర్ పీహెచ్‌సీ రెండంతస్తుల భవనం బర్మాక్యాంపు రోడ్డులో నూకాలమ్మ ఆలయం పక్కన ఉంది. ఈ భవనాలు ఇంతవరకు బూత్ బంగ్లాలా మారి పేకాటలకు, మందు బాబులకు అడ్డాగా మారాయి. దీంతో పరిసర నివాసితులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు భవనం పునర్నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. కార్పొరేటరు, వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు చొరవతో రూ. 60 లక్షలు మంజూరయ్యాయి. అయితే, ప్రాథమిక అంచనాతో రెండు అంతస్తుల కమ్యూనిటీ భవనంపేరిట ప్రస్తుతం నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఒక ఫ్లోర్‌లో సచివాలయం ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఏదిఏమైనా ఇటీవల శంకుస్థాపన తర్వాత ఈ పాత భవనం తొలగింపు పనులు పూర్తి కావచ్చాయి. దీని దిగువ బేస్‌మెంట్ ఫ్లోరుని కూడా మూసేశారు. పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఏళ్ల నాటి వృథా భవనం అభివృద్ధికి నోచుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


చదును చేసిన హెల్త్ సెంటర్ స్థలం

మాట ఇచ్చి, మడమ తిప్పి...

... 5వ పేజీ తరువాయి

కె.లోకనాథం విమర్శించారు. రాష్ట్రంలో తాము నాలుగు లక్షల మంది ఉన్నామని, కుటుంబ సభ్యులతో కలిపితే సుమారు పది లక్షల ఓట్లు ఉంటాయన్నారు. తమను మోసం చేసిన ఈ సర్కారుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టంచేశారు. ఐదేళ్ల కిందట ఏర్పాటుచేసిన రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయకుండా ఎందుకు మోసం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

గీత దాటితే వేటు తప్పదు

... 5వ పేజీ తరువాయి

సువిధ యాప్ అందుబాటులో ఉందన్నారు. అయితే ఎవరు ముందుగా అనుమతి కోరితే వారికే తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడదలయ్యేంత వరకూ ప్రచారం ఖర్చు సంబంధిత రాజకీయ పార్టీ ఖాతాలోకి వెళుతుందని, నోటిఫికేషన్ వచ్చిన తరువాత అభ్యర్థి ఖాతా కిందకు వస్తుందని పేర్కొన్నారు. పార్లమెంటు అభ్యర్థికి రూ.90 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థికి రూ.40 లక్షలు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఎన్నికల విధుల్లో తప్ప ఇతరత్రా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని స్పష్టంచేశారు. ఇప్పటివరకు జిల్లాలో సీ విజిల్ యాప్ ద్వారా 12 ఫిర్యాదులు వచ్చాయన్నారు. అభ్యర్థి, ఏజెంట్లు, అనుచరుల వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని, వస్తు రూపేణా రూ.10 వేలకు మించి ఉండరాదని, విరాళాలు రూ.20 వేలకు మించి స్వీకరించరాదన్నారు. రూ.లక్షకు మించి నగదు బదిలీ జరిగితే నిఘా ఉంటుందని, వెంటనే ఆదాయ పన్ను శాఖకు తెలియజేస్తామన్నారు. ఎన్నికలపై కథనాలు ప్రచురించే ముందు రిటర్నింగ్ అధికారి నుంచి సరైన సమాచారం తీసుకోవాలని మీడియా ప్రతినిధులకు సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ఎనిమిది టీమ్‌లు పనిచేస్తాయన్నారు. నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నగర సీపీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సభలు, ర్యాలీలు, వాటికి వినియోగించే లౌడ్‌స్పీకర్లకు ఆర్వో అనుమతి ఉండాలన్నారు. ఎవరైనాతప్పుడు ఫిర్యాదులు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మతపరమైన గొడవలు, వ్యక్తిగత తగాదాలు ఉండరాదని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ మాట్లాడుతూ నామినేషన్ల దాఖలు సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులైతే ఒక్కరు ప్రతిపాదిస్తే సరిపోతుందని, అదే ఇండిపెండెంట్లు అయితే పది మంది ప్రతిపాదించాలన్నారు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన ధరావత్తులో సగం చెల్లిస్తే సరిపోతుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కట్టు తప్పుతున్న ఖాకీలు

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి క్రైమ్ ఎస్ఐ ఈ కేసులో పట్టుబడిన వ్యాన్‌ను తప్పించేందుకు రూ.3.5 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులు శాఖాపరంగా అంతర్గత విచారణకు ఆదేశించగా వాస్తవమేనని తేలింది. అయితే ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అతడిని వీఆర్‌కు సరండర్ చేసి చేతులు దులుపుకున్నారు. తన కారు కొనుకున్న వ్యక్తి సరిగా బ్యాంకు వాయిదాలు కట్టడం లేదంటూ తాజాగా ఒకరు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదుచేయకుండా ఇరువర్గాలను పిలిచి సెటిల్ చేశారు. అందుకోసం తనకు రూ.పది వేలు లంచం ఇవ్వాలంటూ బాధితుడిని డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఇలాంటి ఉదంతాలు నగరంలోని చాలా స్టేషన్లలో జరుగుతున్నాయని, ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని పోలీస్ శాఖలోనే కొంతమంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



మద్దిి జంక్షన్‌లో పడుతున్న వర్షం

అకాల వర్షంతో అవస్థలు

పద్మనాభం (రూరల్), మార్చి 20 : మండలంలోని మద్ది, బోని, వీకేపాలెం, పాండ్రంగి, అర్జునిపాలెం, అనంత వరం, ఏనుగులపాలెం తదితర గ్రామాల్లో చిరు జల్లులు పడ్డాయి. కొద్ది రోజులుగా ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలు అకాల వర్షంతో ఉపశమనం పొందారు. వర్షానికి గ్రామీణ రోడ్లు చిత్తడిగా మారగా, చోడి పంట తడిసిపోవడంతో రైతు లు దిగుబడిపై ఆందోళన చెందుతున్నారు. అలాగే వర్షానికి ఇటుక బట్టీల్లో తయారు చేసిన లక్షలాది ఇటుకలు తడిసి పోయాయి. ఇటుకలు తడవకుండా వ్యాపారులు పరదాలు కప్పినా.. ప్రయోజనం లేకపోయింది. మూడేళ్లుగా అంతంత మాత్రంగా ఉన్న ఇటుక బట్టీల వ్యాపారులు అకాల వర్షానికి మరింతగా నష్టపోయారు.

తీరంలో చిరుజల్లులు

సాగర్‌నగర్, మార్చి 20 : బంగాళాఖాతంలో అల్పపీడ నం వల్ల తీర ప్రాంత గ్రామాలైన సాగర్‌నగర్, రుషికొండలో బుధవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. వేకువజాము వరకూ ఉక్క పోత ఉండగా, మధ్యాహ్నం 12 గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు మొదలయ్యాయి. రాత్రి వరకూ జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో గ్రామాల్లోని మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి.

ఎంవీపీ కాలనీలో ఎంపీ, సీబీఐ మాజీ జేడీ ప్రచారం



ఎంపీ సత్యనారాయణతో లక్ష్మీనారాయణ కరచాలనం

ఎంవీపీ కాలనీ, మార్చి 20 : తూర్పు నియోజకవర్గం లోని ఎంవీపీ కాలనీ పన్నెండో సెక్టరులో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జై భారత్ పార్టీ వ్యవస్థాపకుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ బుధవారం ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. ఎంపీ సత్యనారాయణ ఎమ్మెల్యే అభ్య ర్థిగా ప్రచారం చేయగా, లక్ష్మీనారాయణ తన పార్టీ గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఒక చోట ఎదుర య్యారు.ఇద్దరూ ఏం మాట్లాడాలో తెలియక తనకు మద్దతు ఇవ్వాలని ఎంపీని మాజీ జేడీ కోరగా మీరు కూడా మా పార్టీకి మద్దతివ్వాలని ఎంపీ అనడంతో ఇద్దరూ నవ్వేశారు. అనంతరం ఎవరి దారిలో వారు వెళ్లిపోయారు.

15 వరకు ఓటరు నమోదుకు అవకాశం : తహసీల్దార్

పద్మనాభం (రూరల్), మార్చి 20 : కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి వచ్చే నెల 15వ తేదీ వరకు గడువు ఉందని తహసీల్దార్ ఎస్. వెంకటరావు తెలిపారు. బుధవా రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 18 ఏళ్లు పూర్తయిన వారు ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. యువత ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23,టమాటా 15, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చి మిర్చి 46, కాకరకాయలు 32, బీరకాయలు 34, ఆనపకా యలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారెట్ 26, దొండ కాయలు 22, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 144, బరబటి 18, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచి క్కుడు 34, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 65, కరి వేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోట కూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడి కాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

'గోస్తనీ'లో సరిహద్దు వివాదం

- నీటి పంపకంపై ఇరు జిల్లాల రైతుల వాదనలు
- విశాఖ జిల్లాలో 18 కిలోమీటర్ల మేర ప్రవాహం
- రెండు కిలోమీటర్ల పరిధిలో మాత్రమే స్వల్ప వివాదం
- పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి



చిట్టివలస, గుడివాడ సరిహద్దులో ఉన్న గోస్తనీ నది

భీమునిపట్నం (రూరల్) మార్చి 20 : విజయ నగరం, విశాఖ జిల్లాల సరిహద్దుల్లో ప్రవహిస్తున్న గోస్తనీ నది నీటి వినియోగంలో వివాదం ఏర్పడింది. చిప్పాడ రహదారిలో విజయనగరం జిల్లాకు చెందిన గుడివాడ, మరికొన్ని గ్రామాలు నదిని ఆనుకుని ఉన్నా యి. ఈ గ్రామాలకు చెందిన వ్యవసాయ భూములకు నది నీటిని వాడుతున్నారు. ఇటువైపు విశాఖ జిల్లాకు చెందిన చిట్టివలస, కొత్తపేట, మూలకుద్దు గ్రామాలకు చెందిన భూములున్నాయి. నది అనంతగిరి కొండల్లో పుట్టి విజయనగరం జిల్లా ఎస్. కోట మండలంలో ఉన్న తాటిపూడి రిజర్వాయరులోకి చేరుతుంది. అక్కడి నుంచి వారు విడిచిపెడితే విశాఖ జిల్లాలోని పలు గ్రామాల మీదుగా ప్రవహించి భీమిలిలో సముద్రంలో కలు స్తుంది. అందువల్ల నీరు విశాఖ జిల్లా వాసులకే చెందు తుందని సరిహద్దు గ్రామాల రైతులు అంటున్నారు. పద్మనాభం, బోని నగరపాలెం, చిట్టివలస, సామేయవ లస, మజ్జివలస గ్రామాల్లోని రక్షిత పథకాలను నది సమీపంలో నిర్మించి ఆ నీటిని శుద్ధి చేసి పంపిణీ చేస్తు న్నారు. అయితే ఇటీవల విజయనగరం జిల్లా భోగాపు రం మండలానికి చెందిన గుడివాడ, ఎరుసుపేట తది తర గ్రామాలకు చెందిన రైతులు ఈ నది నీటిని విని యోగించడం, పొలాలకు మోటార్ల ద్వారా మళ్లించడం వంటి పనులు చేస్తుండడంతో వివాదం ఏర్పడింది. తమ జిల్లాకు చెందిన నీటి వనరులను తామే ఉపయో గించుకోవాలని ఇతర జిల్లాలకు చెందిన వారు వాడు కుంటే అందుకు తగిన పరిహారాన్ని ప్రభుత్వానికి చెల్లిం చాలని విశాఖ జిల్లా రైతులు కోరుతున్నారు. అయితే నది తాటిపూడి జలాశయం నుంచి విడుదల అవుతున్న నీటితో ఉన్నం దున తమకు కూడా హక్కు ఉందని ఆ ప్రాంత రైతులు అంటున్నారు. కొంతకాలంగా స్వల్ప వివాదంగా ఉన్న ఈ విషయం ఇటీవల చర్చనీయాం శంగా మారింది. అంతేకాకుండా కొంత మంది చేపలు పట్టడం వంటి పనులు చేస్తున్నారు. నది నీటిలో సముద్రపు నీరు కలవడం వల్ల తమ గ్రామాల్లో కూడా బావుల్లో ఉప్పు నీరు వస్తోందని అందువల్ల నది నీటిని సంపూర్ణంగా తాము వినియోగించడంతో ఎవ రూ అభ్యంతరం చెప్పకూడదని రైతులు అంటున్నారు. నదీ జలాలకు సంబంధించి ఈ హక్కు విషయంలో నిర్దిష్టమైన విధానం లేకపోవడం వల్ల అధికారులు కూడా ఏమీ చెప్పలేకపోతున్నారు. ఈ నది 18 కిలోమీ టర్ల మేర భీమిలి నియోజకవర్గంలో ప్రవహిస్తున్నా.. కేవలం రెండు కిలోమీటర్ల పరిధిలో మాత్రమే రెండు జిల్లాల సరిహద్దు మధ్య గొడవ ఏర్పడిందని పలువురు అంటున్నారు. రెండు జిల్లాలను కలుపుతూ చిట్టివలస నుంచి గుడివాడ వెళ్లడానికి వంతెన కూడా ఉంది. దాదాపు రెండు గ్రామాలు కలిసి పోయినట్లే ఉంటాయి. స్వల్ప వివాదం పెద్దది కాకముందే అధికారులు పరిష్క రించాలని పలువురు కోరుతున్నారు.

మారని అధికారుల తీరు

- వైసీపీకి ఒకలా..

టీడీపీకి మరోలా 'కోడ్' నిబంధనలు

ఆరిలోవ, మార్చి 20 : అధికారుల తీరు మారడం లేదు. ఎన్నికల కోడ్ నిబంధనలు అమలులో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వ్యత్యాసం చూపిస్తున్నారు. ఇందుకు ఈ చిత్రాలే నిదర్శనం. 11వ వార్డులో తూర్పు ఎమ్మెల్యే వెలగ పూడి పేరుతో ఉన్న శిలాఫలకాల్లో పేర్లు కనిపించకుండా వాటికి గోనె సంచులు, క్లాత్‌లు కప్పిన అధికారులు.. అదే సమయంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేరుతో ఉన్న శిలాఫలకాలకు తూతూమంత్రంగా సున్నం వేసి, వదిలే శారు. వీటిని చూసిన పలువురు యంత్రాంగం తీరును తప్పు పడుతున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలలో వైసీపీ, టీడీపీ మధ్య వ్యత్యాసం చూపడం సరికాదని పేర్కొంటున్నారు.



క్లాత్‌తో పూర్తిగా కప్పివేసిన ఎమ్మెల్యే వెలగపూడి వేసిన శిలాఫలకం



నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మేయర్ హరి వెంకట కుమారి వేసిన శిలాఫలకం

గురుకుల పాఠశాల బోర్డుపై జగన్ బొమ్మ

కొమ్మాది : ముఖ్యమంత్రి జగన్ ప్రచార పిచ్చి గురుకుల పాఠశాలలను కూడా వదల్లేదు. ఎన్నికల నియమావళి అమ ల్లోకి వచ్చినా కొమ్మాది రిక్షా కాలనీలోని గురుకుల ప్రతిభా పాఠశాల ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన బోర్డుపై ఉన్న జగన్ చిత్రాన్ని అధికారులు తొలగించలేదు. అంతేకాదు బోర్డు కూడా వైసీపీ రంగులతో ఉంది. అధికా రులు వీటిని తొలగించకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గురుకుల పాఠశాల ప్రవేశ ద్వారంపై ముఖ్యమంత్రి జగన్ ఫొటో

తొలగించిన వైసీపీ ప్రచార బోర్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భీమునిపట్నం, మార్చి 20 : పట్టణంలోని పాత బ స్టాండ్‌లో ఒక దుకాణంపై వు న్న వైసీపీ ప్రచార బోర్డును ఎన్నికల సిబ్బంది తొలగించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వారు స్పందిం చారు. ఈమేరకు దుకాణంపై వున్న బోర్డును తొలగించారు.





కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం

పద్మనాభంలోని అనంత పద్మనాభుని కల్యాణోత్స వాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఫాల్గుణ మాసంలో ఆరు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇప్పటికే కుంతీమాధవ స్వామి ఆలయ ఆవరణలో కల్యాణం నిర్వహించే వేది కను సిద్ధం చేశారు. ఆలయ పరిసరాలు విద్యుద్దీపా లంకరణతో నూతన శోభను సంతరించుకున్నాయి. వారం రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించనున్నట్టు అధికారులు తెలిపారు.

- పద్మనాభం

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు

విశాఖపట్నం, మార్చి 20 : ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనరాదని అధికారులు పదే పదే హెచ్చరి స్తున్నా.. వలంటీర్లు పట్టించుకోవడం లేదు. తూర్పు నియో జకవర్గంలోని 19వ వార్డులో వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్య నారాయణ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు వలంటీర్లు కరుణ, రేణుక, 18వ వార్డులో దాసు, భరత్ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు.

వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన

సిరిపురం, మార్చి 20 : కేన్సర్ చికిత్సలో జాతీయ స్థాయిలో పేరుపొందిన బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి విశాఖలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తోంది. గీతం విద్యా సంస్థల అధ్యక్షుడు ఎం. శ్రీభరత్ చొరవతో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాల్లో ఇప్పటివరకు 1160 మంది కేన్సర్ స్క్రీనింగ్‌కు హాజరుకాగా వైద్య బృందం పలువురిలో కేన్సర్ లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. కాగా నగరంలోని అక్కయ్యపాలెం, చినవాల్తేర్, మర్రిపాలెం, పాత పోస్టాఫీస్, గాజువాక, ఎండాడతో పాటు ఎస్.కోటలో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య నిపుణులు దివ్యసాయి, సులోచనా రాణి, శ్రావన్‌కుమార్, సూర్యవంశీ, శరత్‌కుమార్, రవిశంకర్ రోగులను పరీక్షించడంతో పాటు ప్రజలకు కేన్స ర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. కేన్సర్‌పై ప్రజలకు అవగా హన కల్పించడానికి, చికిత్స అందించడానికి ఉచిత వైద్య శిబి రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎం. శ్రీభరత్ తెలిపారు.

గీతంలో ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సాగర్‌నగర్, మార్చి 20 : గీతం డీమ్డ్ విశ్వవి ద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా నిర్వహి స్తున్న ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ (జిబాట్) జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్టు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు తెలిపారు. ప్రవేశ పరీక్షను ఈనెల 24న దేశవ్యాప్తంగా 80 పట్టణాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంట ర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను సంప్రతించా లని ఆయన సూచించారు.

బయోమెట్రిక్‌కు 96 శాతం మంది వివరాలు అందజేత

ఉక్కుటౌన్ షిప్, మార్చి 20 : స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్ హాజరును అధికారులు అమలు చేస్తు న్నారు. ప్లాంట్‌లో మొత్తం 4,403 మంది విధులు నిర్వహిస్తుండగా ఇప్పటివరకు 4,235 మంది (96.18 శాతం) బయోమెట్రిక్ హాజరుకు తమ వివరాలు అందజేశారు. అలాగే 9,154మంది నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు గాను 6,715 మంది (73.36 శాతం) బయోమెట్రిక్ హాజరుకు వివరాలు అందజేశారు. మిగి లిన ఉద్యోగులను కూడా తమ ఐడెండిటీని ఇవ్వాలని ఉక్కు ఉన్నతాధికారులు సూచించారు. స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం బయోమెట్రిక్‌తో పాటు డార్స్ విధానం కూడా కొనసాగుతున్నది.

ఎంవీపీలో బుల్లి తెర నటి వర్ష సందడి



ఎంవీపీ కాలనీ, మార్చి 20 : బుల్లి తెర నటి వర్ష నగరంలో సందడి చేసింది. లాసన్స్‌బే కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ షాపును ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేక రులతో మాట్లాడుతూ విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఇక్కడి వాతావరణం ఎంతో బాగుంటుందని చెప్పారు. ఆమెతో పాటు స్వామి శ్యామలానంద, రవి ఉన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భీమునిపట్నం, మార్చి 20 : పట్టణంలోని కృష్ణా కాలనీ వెంకట గిరిపై పద్మావతి, గోదా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆల యంలో పుష్కర వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగు తున్నాయి. బుధవారం ఉదయం సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధన లతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గరుడ పంచశయ్యాధివాసం, గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం విశేష హోమాలు, ఎదురోత్సవం, అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం నాయకులు గాడు అప్పలనా యుడు, ధనాలకోటి శ్రీచంద్రమూర్తి, ఆదిమూలం నాగరాజు, ముమ్మిడిశెట్టి సత్యా నందరావు, కె. ముత్యాలరావు, గాడు సన్యాసినాయుడు, వై. హరి పాల్గొన్నారు.

పూడికలతో పెదగదిలి గెడ్డ

ఆరిలోవ, మార్చి 20 : పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే ప్రధాన గెడ్డ పూడి కలతో నిండిపోయింది. గెడ్డపై ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో గెడ్డలో నీరు ప్రవహించకుండా అడ్డుకట్ట వేయడంతో చెత్త భారీగా నిలిచిపో యింది. ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారింది.అటువైపుగా వెళ్లాలంటే పాద చారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరిలోవ ప్రాంతంలోని అన్ని కాలువల నుంచి వచ్చే వాడుక నీరు, మురుగు ప్రధాన గెడ్డలోనే కలుస్తోంది. దీంతో గెడ్డ మొత్తం మురికి కూపంలా మారింది. అధికారులు తక్షణమే స్పందించి గెడ్డలో పూడికలు తొలగించడంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



గెడ్డలో పేరుకుపోయిన మురుగు



డైట్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత

భీమునిపట్నం,మార్చి 20 : పిచ్చుకల ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని డైట్ లెక్చరర్ గొట్టేటి రవి అన్నారు. బుధవారం డైట్‌లో నిర్వహించిన ప్రపంచ పిచ్చుకల దినోత్సవంలో ఆయన మాట్లాడారు.పిచ్చుకలు ఆహారంగా తినే చిన్న చిన్న కీటకాలు, క్రిములు వల్ల జీవ వైవిధ్యం సాధ్యమవు తుందన్నారు. పంటలకు చీడల ముప్పు తగ్గించి మేలు చేస్తున్నాయని చెప్పారు. ఒకప్పుడు 35 వరకూ పిచ్చుకల జాతులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య పది వరకూ తగ్గిందన్నారు. పట్టణీకరణ, రేడియేషన్, రసాయనాల వినియోగం వల్ల ఆ జాతి అంతరించిపోతుందన్నారు. అనంతరం ఐ లవ్ స్పారో, వుయ్ లవ్ స్పారో, లాంగ్ లివ్ స్పారో అంటూ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు సారిపల్లి త్రినాథరావు, మహాలక్ష్మి, జె. మాధవి, ఛాత్రోపాధ్యాయుని రితీషా, రఘు తదితరులు పాల్గొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాలలో...

తగరపువలస : బంగ్లామెట్ట పాఠశాలలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అప్పలరాజు పిచ్చుకల సంరక్షణ గురించి విద్యార్థులకు వివరించారు. వేసవి నేపథ్యంలో వాటికి నీరు, ఆహారం ఇళ్ల వద్ద అందుబాటులో ఉంచాలని చెప్పారు.

మరోసారి అవకాశమివ్వండి : వెలగపూడి



వాకర్స్‌తో మాట్లాడుతున్న వెలగపూడి రామకృష్ణబాబు

మద్దిలపాలెం, మార్చి 20 : ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో వాకర్స్‌తో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం ఉదయం ముచ్చ టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దఫాలు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముం దుండే తనకు నాలుగో సారి కూడా మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. వైసీ పీ నుంచి రాష్ట్రాన్ని కాపాడాలంటే ప్రజలు ఉమ్మడి పార్టీల అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలన్నారు. అలాగే టీడీపీ వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వాకర్స్‌కు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొలగాని పురుషోత్తం, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, మిల్లు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో మాజీ మంత్రి గంటా

ఆనందపురం, మార్చి 20 : మండలంలోని కణమాం గ్రామంలో అభ యాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచీ స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఉత్తర ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్య క్రమంలో గ్రామ పెద్దలు విజయ్‌బాబు, యర్రా రాము, చందవరపు కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గొల్లల ఎండాడలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు అందిస్తున్న నాయకులు

ఎండాడ, మార్చి 20 : జీవీఎంసీ ఎనిమిదో వార్డు గొల్లల ఎండాడలోని ప్రభుత్వ పార్కు ఆవరణలో బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 500 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన అధ్య క్షుడు శాఖరీ శ్రీనివాస్, నాయకులు కాటూరి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గని గ్యాస్ సిలెండర్ ధర

పద్మనాభం (రూరల్), మార్చి 20 : గ్యాస్ సిలెండర్‌పై వంద రూపా యలు తగ్గించినట్టు కేంద్రం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఇప్పటికీ కొన్ని ఏజెన్సీలు వినియోగదారుల నుంచి పాత ధరలే వసూలు చేస్తు న్నాయి. కేంద్రం రాయితీ మినహాయించి సిలెండర్‌కు రూ. 833 వసూలు చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని కంపెనీలు రూ. 900, మరికొన్ని రూ.950 వసూలు చేస్తున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలా జరుగుతోందని పేర్కొంటున్నారు. ఈ విషయమై సంబంధిత అధికా రుల వద్ద ప్రస్తావించగా రసీదుపై ఉన్న ధర కంటే ఎక్కువ తీసుకోకూడదని, అధిక ధర వసూలు చేసే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సిగరెట్ పెట్టెల బాక్సు అపహరణ

పద్మనాభం, మార్చి 20 : పద్మనాభంలోని ఫ్యాన్సీ స్టోరు వద్ద నిలిపి ఉన్న టీవీఎస్ మోపెడ్ నుంచి సిగరెట్ పెట్టె బాక్సులను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. విజయనగరం జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన ప్రకాశరావు దుకాణాలకు సిగరెట్ బాక్సులు విక్రయిస్తుం టాడు. ఈమేరకు పద్మనాభంలోని ఎం. శ్రీనివాసరావు షాపు వద్ద సరకుతో ఉన్న తన మోపెడ్‌ను ఆపి, షాపు యజమానికి సిగరెట్ బాక్సులు ఇస్తుండగా ఆగంతకుడు బైక్‌పై వచ్చి మోపెడ్‌కు ఉన్న రూ. 48 వేలు విలువైన సిగరెట్ బాక్సులను దొంగిలించుకుపారిపో యాడు. వెంటనే బాధితుడు పోలీ సులను ఆశ్రయించగా వారు సమీపంలోని సీసీ పుటేజీలను పరిశీలించగా స్కూటీపై వచ్చి ఈ చోరీకి పాల్పడినట్టు తెలిసింది.